నివాళి

# ఖాళీ సీసాలు

- స్మైల్

అతను కే.జీ. హాస్పిటల్ వరండాలో నడుస్తున్నాడు, బయటికి రావడానికి గేటు దగ్గరికి. అతని మొహం పాత బ్రౌన్ పేపర్లా ఉంది. అతని చొక్కా పాలి పోయిన నీలిరంగులో అతన్ది కానట్టుగా ఉంది. పైజమాలా ఉన్న ప్యాంటు ఇస్త్రీ మడతలు పోయి మోకాళ్ల  ముందు అసహ్యంగా వుబ్బి, వెనక ముడ తలు పడిపోయి వుంది. ఆ బట్టల్లో అతని పాతికేళ్లు నీరసంగా బలహీనంగా నలభై యేళ్లలా కనిపిస్తున్నాయి.



అతను చాలా చీకాగ్గా బయటికొస్తున్నాడు-మెల్లగానే.

హాస్పిటల్‌లో అతని తల్లి,ఆవిడకీ, అతనికీ తెలీని జబ్బుతో పడి ఉంది.

హాస్పిటల్ వరండాలో నుంచి అతను బయట కొచ్చి గేటు దగ్గర నిలబడ్డాడు. అతని వెనక నిస్తేజంగా రోగిలాగా వుంది హాస్పిటల్.

ప్యాంటుజేబులో డబ్బుల్ని తడిమింది అతని కుడిచెయ్యి. వేళ్లకి ఒక పదిపైసల బిళ్ల,ఒక అయిదు పైసల బిళ్ల తగిలాయి. మురికి గుంట నీట్లోఅడుగున జాగ్రత్తగా దాక్కున్న కప్ప పిల్లల్లా.

నేను పదిహేను పైసల మనిషిని. ధరలు ఆకాశాన్ని పెళ్లి చేసుకున్న ఈ విశాఖ పట్నంలో నేను పదిహేను పైసల మనిషిని. ఈ పదిహేను పైసల్తో నేనో ఖాళీ సీసా కొనుక్కోవాలి, ఆనర్సు ఎడమ రొమ్ము గోక్కుంటూ "సీసా తేలేదా? తెచ్చుకో, మందు పోసిస్తా" అంది. " మీ దగ్గరుంటే.." అంటూ నసిగితే "నేనేమైనా సీసాల్యాపారం చేస్తున్నానేటి?" అంది చికాగ్గా. ఏయ్! గొట్టం ప్యాంట్ డాక్టర్ కుర్రాడా! నువ్వు హాయిగా జాలీగా డాక్టరై పోయావ్. నీకు డబ్బుంది. నాకు లేదు. అవకాశం నీది. ఆకాశం నాది.నేనుబీదవాణ్ణి. నాకు తెలిసిన యిరవై యేళ్లనుంచీ నేను బీదాణ్ణే? నా బాబూ,నా బాబూ,నా తాతా, నా ముత్తాతా అంతా బీదాళ్లే అయ్యుంటారు బాబూ. వో వో కారులో కుక్కతో పోతున్న టక్కుల పిల్లా! నీ కుక్క కారులోంచి ఏం దర్జాగా మనుషిల్ని చూస్తోంది. పోపో! నీ కుక్కకి వీధికుక్కలు కుక్కల్లా కనిపించవ్.పోవే పిల్లా పో. పోయి చూడు. ఆ లీలా మహల్లో,ఇంగ్లీస్ సిన్మాని!

అమ్మా! నువ్వెవర్వి? ఏ వీధి నాది! ఏ మురికివాడలో ఏ గుడిసె నీడ నీది? ఎందుకలా ముళ్లకంపలా నీ జుట్టు? పొగబారిన చూరులాంటి కళ్లలో - ఏమిటది చూపా? తల్లీ! ఏవిట్నీ బాధ? ఎవిట్నీ కథ?

నీకు తల్లీ తండ్రీ లేరా? పిల్లాపీచు చీకుచింతా వున్నాయా? అలా వెళ్లకమ్మా - సగం నీళ్లమట్టి కుండ నడుస్తున్నట్టు అలా వెళ్లకమ్మా! శ్రుతి తప్పిన గీతం ఏడుస్తున్నట్టు.. హేయ్, పందీ! హాస్పిటల్‌లో రౌండ్లు కొట్టివస్తున్నావా? ఏఏ మూలల కెళ్లావ్? ఏఏ పెంటల్ తిన్నావ్? పెంటల్ చెప్పిన కథలు చెప్పు - ఎవడికి అజీర్ణం? ఎవడికి కలరా? ఇంకెవడికి నెత్తురు విరోచనాలు?

చెప్పు పందీ చెప్పు.

నీవు చెప్పిన కథలనేవి పత్రికల్వేయవ్.

ఏయేయ్! గుర్రం పిల్లా కాలేజీ గర్లా! చంపకు! తెంపకు నరాల తాళ్లు. మొన్న నీలాంటిదే పెటపట్లాడేవెవతో - ఆ లక్ష్మీ టాకీస్ దగ్గర రూపాయి తీసుకొని బుగ్గకొరికి, మెడ నిమిరి రోగాల్లేని రేవతంటే ఏ రిక్షాకైనా తెలుసంటూ, ఛ! పచ్చి లంజ. రోగాల రొంపి. "అప్పుడేటైంది నాయనా, బాధ! అబ్బా అంటున్నావ్ యిప్పుడింజషనిస్తుంటే? అన్నాడు ఆ కంపౌండర్.ఓరే! రోగాల గూట్లో తొంగొనే మనిషీ! ఏంచేయను రోగాల్తెచ్చుకోక!"

అతను హాస్పిటల్ గేటు దగ్గరే నిలబడి వున్నాడు.

గేటు పక్కనే కుష్టురోగి చర్మంలా వున్న పాత బల్లల మీద రంగు రంగుల బందీల్లాగా ఖాళీ సీసాలు - అమ్మకానికి. ఆ బల్లల ప్రక్కనే చిన్నచిన్న బల్లల మీద నిలువరొట్టెలు,. కుళ్లిన ద్రాక్షపళ్లు. పురకులు, పాసిన యిడ్లీ, ఎండిపోయిన బత్తాయిలూ, మధ్య మధ్య వాటినన్నిట్నీ పలకరిస్తోన్న ఈగలూ.

ఆ బల్లలకి కాస్త వెనక హాస్పిటల్ గోడ ప్రక్కన మురికి కాలువ. అందులో రోడ్డు మట్టానికి గజం కింద నీళ్లు మురిగ్గా నల్లగా సిరా పారుతున్నట్లు పెంటా, నీరు, కంపూ తేలిపోతూ మురికి కాలవ గట్టుమీద ఏడెనిమిదేళ్ల యిద్దరాడపిల్లలూ,పదేళ్ల కుర్రాడు. దొడ్డికి కులాసాగా కూచొని ఒక్కొక్కళ్లుపోసిన ఉచ్చ ఎంత దూరం పాకిందో గొప్పగా చెప్పుకుంటూ,ఒకర్నొకళ్లు డబాయించుకుంటూ, వాళ్లకి కాస్త దూరంగా ఒక ముసలి కుక్కా: నాలుగు పంది పిల్లలూ పెంట కెలుకుతూ తింటూ.

హాస్పిటల్ గేటుకి ఎదురుగా, రోడ్డుకి అవతలి వైపున వాలులో హోటళ్లూ, బేకరీలూ,షాపులూ,రోడ్డుమీద కార్లూ, సైకిళ్లు, స్కూటర్లూ,సిటీ బస్సులూ,ఆడా మగా - కొందరు అందంగా, హుందాగా, నిర్భయంగా, కొందరు భయంగా, బితుకు బితుగ్గా- పోతూ,

ఖాళీ సీసాలున్న బల్లవైపు చూడక ముందు అతను ఇవన్నీ చూసి.

"వీధులను మురికి చేయకుము. మురికియే వ్యాధులకు కారణము". ఎవరన్నారీ మాటా?గాంధీయా, నెహ్రూయా, ఇందిరాగాంధీ నెహ్రూయా ఎవర్నారు?

మురికిని వీధి చేయకుడు. వీధియే వ్యాధికి కారణము.

లేకపోతే

వ్యాధియే వీధికి కారణము.

అందువల్ల - వీధిని మురికి చేయకుము. మురికిని వీధి చేయకుము.

అనండి బాబూ అనండి: ఆనందించండి.

"సీసా కావాలేమిటి బాబూ?రాండి! ఆర్నాలు"

గేటుకి ఎడమ వైపున వున్న ఆడది, చీర తప్ప జాకెట్‌లేని శరీరంతో ముప్ఫై యేళ్లు బిగుతుగా ఆహ్వానంలా కనిపిస్తుంటే

అతను

ఆ పైట వెనక రెండేళ్ల వైధవ్యంలో పదిపదిహేనుమందినో ఇంకెంత మందినో ఇంకెంత మందినో - ఇరవయ్యో ముప్పయ్యో చేతులు, వందో నూట యాభయ్యో వేళ్ల మత్తుగా, ఆవేశంగా, హాయిగా తడిమి.

నమిలి,నలిపీ, యేదేదో చేసేసిన రొమ్ముల్ని కాస్త బిగుతు సడిలినా అందంగా, పొంకంగా కనిపిస్తుంటే.

వాటిని చూపుల్తో తడుముతూ, తడుపుతూ అవిడవైపు అడుగేస్తుంటే -

హమ్మయ్య! పొద్దుటేల్నుంచీ బేరం సారం నేదనుకున్నా. ఆర్నాల్లన్నా బేరవాడి పావలాకైనా ఏదో



సీసా తీసేసుకుంటాడే బాబు. పావల వొస్తే చెల్లెలికి రెండు తెల్లకాయితాల బొక్కుల్కొనొచ్చు. నంజకొడుకు ఆ రంగడు నిన్న రేత్రి ఎద్దల్లే కుమ్మి, కుక్కల్లే కొరికి రెండ్రూపాయలిచ్చి,అరగంటాగొచ్చి "పైడీ! పోలీసొచ్చాడే మామూలియ్యాలానీ ఆ రెండిటీ, ఆనక సూసుకుందాం" అని గుంజేసుకుపోనాడు. ఆ రెండులో చెల్లికి చౌకలో ఏదన్నా జాకీటు ముక్కా, రెండు రిబ్బన్లూ కొనచ్చునుకున్నా. గుంటెంత అందంగా వుంటాది! అది సదువుకుని, పెద్దదైం తరువాత- సీ! సీ! ఈ బతుకా - మారాణల్లే బతకాలది, యంత్రామారావొంటి మొగుడొచ్చి జమునల్లే వుండాలది. పదకొండేళ్లే అయినా గుంటంటాదీ - " ఆ రంగడూ ఆళ్ళూ రేత్రులు ఎందుకొస్తారే అప్పా" అని. దానికేటెరిక. అది బాగడ్డానికే. దాని బతుకు ఎంగిలాకల్లే కుక్కల్నోట్లో, పందుల్నోట్లో సిరక్కుండా వుండానికే నానలా సత్తున్నానని, సారా యాపారన్నా చేద్దావంటే పెట్టుబడి కావాలాయె. తెలివి తేటలుండాలాయె, పోలీసోళ్లు జాగరపు కళ్లల్లే తిరుగుతారాయె.

పేచీ గీచీల సిక్కులుండకూడదనుకుంటే మామూళ్లక్కావాలాయే. ఆ నరకం కంటే ఒళ్లమ్ముకోడమే సుకం. ఎవడో ఓడు నికార్సుగా దొరుకుతాడు.. ఓ డబ్బున్న ఆసామి నెవణ్నో ఎప్పుడేనా వల్లో యేసుకోవాలి, వంటి బిగుతు పోతే ఎవడూ దగ్గరికి రాడు.

"రాండి బాబూ రాండి! ఈ మాత్రం సీసా కావాలా? ఇంకా పెద్దదే కావాలా! రాండి సూద్దురు గాని-"

ఆర్నాలా ఆఖాళీ సీసా! ఒసేయ్ - జాకెట్ లేని.. ఆర్నాలే అది, కంటినిండా వున్నావని నీ వైపొస్తుంటే ఆర్నాలంటావ్? నా దగ్గర పదిహేను పైసలే

వున్యాఇ. పదిహేను పైసల పాదుషాన్ నేను.. పదిహే.. ..

''పావలా అవుద్ది బాబూ – పైసా తగ్గదు''.

బాబూ! ఇదిగో బాబూ! నేనిస్తా రండి. బేడి ద్దురు చాలు. పెద్ద సీసాయే చూడండి'' గేటుకి కుడి ప్రక్కనుంచి యింకో ఆడది. అతుకుల చీరలో – జాకెట్ లేకుండా – నల్లగా, సన్నగా.

బేడ! బేడ కావాలి బాబూ నాకు. పొద్దుటే ట్నించి టీనీళ్లు లేవు. కొంపలో వున్న ముప్పావలాని రాత్రి ఆడట్టుకెళ్లాడు. ఇంకా అయిపు లేదు.తాగి ఏ మూల తూగి పడిపోనాడో, పడిపోయి ఏ మూలన్నా సచ్చిపోనాడో ఎరికనేదు. గుంటడూ గుంటదీ ఏ బస్సుల్కాడో అడుక్కుంటా వుంటారు. అది పాడుద్ది ఆడు చెక్కల్కొడ్తాడు.ఆడుకోవాల్సిన ఈడులో పాడు పిల్లలు అడుక్కుంటున్నారు బాబూ! ఈ పసికూన చూడు. గరుకుర్రాళ్లనేలమీద, ఆకాశాన్ని ఏటో అడుగుతున్నట్లు చేతులాడించే స్తాంది. ఆకాశం బరువుగా మీదపడిపోతున్నట్టు కాళ్లు ఎగరదన్నేస్తాంది బాబూ! దీనికి పాలీడానికి పాల్లేవు. రొమ్ము బీడైపోనాది. పాడయిపోనాది. లబ్బుర్పీకని సీకినట్టు పసిది రొమ్ముల్ని సీకుద్ది బాబూ, రొమ్ముల్లోంచి ఏటొస్తాది నీల్లి బాత్తప్ప.. బేడ సాలు టీనీళ్లొస్తాయ్, కాస్త ఆధరువు. బతకడం ఎంత కష్టం బాబూ! బతుకు మీద తీపి ఏట్లైనా సెయిస్తాది. ఆ పైడల్లే ఒళ్లమ్ముకుందావన్నా జిగేదీ, బిగేదీ? వొంపులేవి, వొయ్యారాలేవి? ఏదీ నేదు. ఆ సీసాలమ్ముకుంటున్నా. ఆడున్నాడా. మొగుడే. తాగుతాడు.తంతాడు. రిచ్చానాగి ఆడు తెచ్చేదెంతో ఆడికే యెరుక. ఆ రాముడికే యెరుక. ఆ సారా కొట్టోడికే యెరుక. బిడ్డలున్నారు బాబు, ఆకలి గడ్డలు.

నూకాలమ్మ మనసులో ఆలోచనల హోరు, జోరు హోరు.

బేడే అంటోంది. మూడు పైసలేం తీసుకుంటా గానీ కొనేస్తే పదిహేను పైసలిచ్చి.

''ఏదీ సీసా చూపించు'' అతను గేటువైపు నుంచి ఎడమవైపుకి వచ్చాడు.

''ఇదే బాబు, ఇదే''.

తీసేసుకున్నాడు బాబు. పదిహేను పైసలిచ్చి, మూడు పైసలుంచేసుకో అన్నాడు, ధర్మాత్ముడు.

మందుకోసం చేతిలో ఈ ఖాళీ సీసా. వొంటి మీద ఈ మాసిన బట్టలు. ఇదే నేను. అమ్మ ఏ బత్తాయిలు కావాలంటుందో, ఏ ద్రాక్షలు తింటానం టుందో.

అనదు

నేను యివేం కొన్లేనని అమ్మకు తెలుసు. అందు వల్ల అటువంటివేం అడక్కుండానే చచ్చిపోనైనా చచ్చిపోతుంది అమ్మ.

అమ్మా చచ్చిపో!

సిరులు పొంగే భరతభూమిలో చచ్చిపోయి
ఆ స్వర్గదేశమో, ఆ నరకదేశమోపోయి
పాడమ్మా పాడు...
ఏ దేశమేగినా ఎందు కాలిడినా..

అతనికి హాస్పిటల్ వరండా రాక్షసుడి గొంతులా వుంది. ఆ నర్సులూ,రోగులూ, డాక్టర్లు నిలువుగా నడుస్తున్న వికృతపు గొంగళి పురుగుల్లా ఉన్నారు.

అతని వెనక – గేటు దగ్గర–

పైడి :నేన్రంకుదాన్నా? నువ్వే రంకువి. నీ తల్లి రంకుది.దాన్నల్లి రంకుది. నీ పిల్ల రంకుదవుద్ది.

పైడితల్లి కోపంతో పామై నూకాలమ్మ దగ్గరికి పోయి చెంప ఛెడీల్మనిపించింది.

నూకాలమ్మకి ఆదెబ్బతో శోషొచ్చినట్టునిపించింది. కాయలు రాల్చడానికి రేక్కాయచెట్టుకొమ్మని కుర్రాడు పట్టుకు వూపినట్టుంది ఆ దెబ్బ.

ఆ దెబ్బతో నూకాలమ్మ కూడా పామైపోయింది.

సత్తువ తెచ్చుకుంది. చేతుల్ని విసురుగా గాలిలోకి వూపింది పైడికి మెడమీద తగిలింది ఒక చేతి దెబ్బ. ఆ చేతికే పైడి కొప్పు మెత్తగా తగిలింది. దీని

అయ్యో.. .సీ...సీర... ఆగ.. ఎంత పన్చేశావే పైడీ! అదేటే ! అదేటే!!

(అయ్యో నా సీరని ఎటో ఇసిరేబోతున్నాదిది..) నీకు దండవెడతానే –

(అయ్యో.. నా సీరని ఆ మురిక్కాలవలోకి ఇసిరేసినాది.)

(నా వొంటిమీద సీరలేదు. అయ్యో! ఇందరు మగాళ్లు. ఆడాళ్లు. అందరూ అందరూ నన్నూ నా మొండి మొలని సూస్తన్నారు.)

నంజా! సూడే! నీ పన్జెప్తా.

(నూకాలమ్మ పైడి చేతులమీద కొరికి..)

పైడి : అమ్మో! అమ్మో!

నూకాలమ్మ : నా సీర నాగేసినావ్ కాదే.

(పైడి జుట్టు నూకాలమ్మ ఎడమచేత్తో చిందర వందర చేస్తూ, కుడిచేత్తో పైడిని డొక్కలో పొడుస్తూ వొంగి, పైడి చీరని పైకెత్తి, లాగి, గుంజి, చీర వూడి రాకపోయేటప్పటికి పైడి మీద కలబడి పైట పట్టు

## ఈ కథ మీ కోసం...



అతను అందగాడు. నవ్వితే ఇంకా అందగాడు. పలకరిస్తే చాలు! ప్రేమిస్తాడు. పలకరించకపోయినా అభిమానిస్తాడు. మంచి కథ రాసినా, కవిత రాసినా తర తమ భేదం, తరాల భేదం లేకుండా మెచ్చుకునే మనిషి, హాయికి పర్యాయ పదం, తురాయికి ప్రతి రూపం...స్మైల్...సూర్య కిరణంలాంటి వాడు, చదివితే జ్వరం తిరగబడినట్టుండే రచనలు చేసినవాడు. సాహితీ ప్రపంచాన్ని ఆ చివర నుంచి ఈ చివర వరకు చుట్టి వచ్చిన వాడు. కథను కలవరించిన వాడు. కవితను శ్వాసించిన వాడు. ఏమయిపోయాడు? 5 డిసెంబర్ 2008న కన్నుమూసి, శాశ్వతంగా అందరికీ దూరమయిపోయాడు. అయినా అతను రాసిన 'ఖాళీ సీసాలు' కథ చదివితే మీ ముందుంటాడు. మీ కళ్ళల్లో వెలుగవుతాడు. స్మైల్‌కి నివాళిగా ఈ కథ మీ కోసం...

కొప్పట్టుకొని మెడ సాగదీస్తా. కుఇక్మని సావాలి. నంజ. నా పిల్లలు రంకువాళ్లతారంటాదీ.

పైడి : కొప్పొదల్వే. రాకాసి ముళ్లకంప! అమ్మో సచ్చాన్రో!

(ఈ నూకాలమ్మని సంపేయాలి. పేణం పోతున్నట్టుండాది కొప్పు నాగేస్తుంటే, దీని పనిట్టా కాదు).

నూకాలమ్మ : అమ్మో! నంజా! సీర నాగేత్తున్నావే! యేటే! యేటే! ఆగవే! ఉసే పైడీ! సిగ్గునేదే నీకు. సీరే – లాక్కే! అయ్యో! అయ్యో! సూత్తూ వూరుకుంటారేటి బాబూ! సీర నాగేస్తున్నాదిది.

(నూకాలమ్మ కింద పడిపోయి చీరని చేతుల్తో గట్టిగా పట్టుకుని.)

బాబూ!

(చీరొదిలి రెండు చేతులూ కింద ఆనించి లేచి నిలబడబోతుంటే పైడి నూకాలమ్మని దవేలున కింద పడదోసి బరబరా బరబరా)

కుని, బుజంమీద కొరికి పైడి చీరని దొరకపుచ్చుకుని జిర్రు జిర్రున కవ్వం లాగుతున్నట్టు లాగేసి).

ఇప్పుడెట్టా వుందే పైడీ?

పైడి:........

(బాబోయ్ ఇది పిచ్చి కుక్కల్లే కరిచేసినాది. నెత్తురు).

పైడి చీరని మురిక్కాలవలో పడేటట్లు విసిరేసింది నూకాలమ్మ. అది అందులో పడలేదు.కాలవకి కాస్త పక్కన – పంది పెంట.

మీద పడింది

పైడి. అలాగే, బట్టల్లేకుండా నూకాలమ్మ మీద విరగబడింది.

ఇద్దరూ కలబడ్డారు. కింద దొర్లారు. సగంలేచి మళ్లా పడ్డారు. కిందామీదా పడ్డారు. దొర్లారు.. దొర్లారు.

నూకాలమ్మ హఠాత్తుగా లేచింది. పట్టు విడిపించుకొని. గబగబా పరిగెత్తింది.

మురికి కాలవలో పడకుండా వుండిపోయిన పైడి చీరని, కాకి సబ్బు ముక్కను కరచుకుపోయి నట్టు లంకించుకుని.

''చావే, పైడీ, చావు. నా చీరని మురిక్కాలవలో పారేశావ్‌గా. నీ చీర నేనెత్తుకు పోతా మొండి మొలతో చావేనంజా చావు''.

నూకాలమ్మ – పరుగు, దొంగలాగా, చీరని ఆదరాబాదరా తొడల మధ్య కప్పుకుని, పరుగు, ఒకటే పరుగు.

ఇదంతా నిమిషాల్లో అయిపోయింది.

కిందపడి వున్న పైడి గభాలున లేచింది. తన చీర పట్టుకు పారిపోతున్న నూకాలమ్మని పట్టుకోవా లనుకుంది. నూకాలమ్మ మెరుపై పోయింది. మరుగై పోయింది.

అప్పుడు –

అలా ఒంటిమీద బట్టల్లేకుండా నిలబడడం పైడికి భయంకరంగా అనిపించింది. బాధనిపించింది. కళ్లు ఏడుపు సముద్రాలయ్యాయి. కిందపడి వున్న తను ఎందుకు లేచానా, అనుకుంది. అలాగే నేలమీద బోర్లాపడి వున్నా పోయేదనుకుంది. చేతుల్తో రొమ్ముల్ని కప్పుకుంది. కోడిపెట్ట రెక్కల కింద పట్టనన్ని పిల్లల్ని దాస్తున్నట్టు. ఈ సారి రెండు చేతులూ తొడలమీదకి, తొడల మధ్యకి, రొమ్ములు రొమ్ములు గాలిని ఎదిరిస్తున్నట్టు! ఒక చెయ్యి మళ్లా రొమ్ముల కడ్డంగా, ఒక చెయ్యే తొడల మధ్య నొక్కుకుని, అటూ యిటూ చూస్తే.

మనుషులు,మనుషులు,మనుషులు, మనుషులు ఎటు చూసినా మనుషులే..

వాళ్ల తలలు తలలు తలలు.

తలల సముద్రం. తలలలల సముద్రం.

వాళ్ల కళ్లలో కోరికల పిచ్చి పిచ్చి ముళ్లు.

మురికి కాలవలో నూకాలమ్మది తను విసిరేసిన చీర మురికి నీళ్లకి సిగ్గేమోనన్నట్టు చిందర వందరగా కప్పుతూ నల్లగా, మురిగ్గా,కంపుగా నవ్వుతూ.

చీరని తీయాలంటే అంత కిందికి దిగాలి. గజం కిందికి. నడుం వంచినా,అడుగు కదిపినా ఎన్నో కళ్లు – దయ కురిపించేవి. భయం గాండ్రుమనేవి, ప్రేవొలకబోసేవి పగ రగిలించేవి. కళ్లు. మొరపెట్టుకునేవి, కోసేవి ఊసేవి, నిమిరేవి. ముద్దెట్టుకునేవి. ఇన్ని కళ్లు. ఇలాంటిలాంటి కళ్లు,. ఎలాంటెలాంటివో కళ్లు.

ఆడదాన్ని.

నన్ను

ఒంపులొంపుల దాన్ని. జిగిబిగిదాన్ని చూస్తుంటే,చూస్తుంటే.

పోట్లాటలో ఏ మూలకో పోయిన తను ఆడదాన్నన్న జ్ఞానం సంగతీ అప్పుడు అప్పుడంటే అప్పుడే ఒక్కసారి ఫెడీలున బట్టలేని ఒంటిమీద కమ్చీతో కొట్టినట్టు కొడితే –

అయ్యో అయ్యో అయ్యయ్యో. నేనాడదాన్ని. ఒంటిమీద బట్టలేనిదాన్ని,ఈ వీధిలో వానలో ఆవల్లే నుంచున్నదాన్ని. ఇంతేసిమంది కళ్లలో రకరకాలుగా మారిపోయినదాన్ని, ఒరే దేవుడా! సచ్చినోడా! వల్లకాటిరావుడా! ఆకాశం సీల్చుకొచ్చి మా మానానికి అడ్డడరా నువ్వు. కాసుకోడానికి పాండవుల పెళ్లావే కావాల్రా. ఈ రొమ్ములకడ్డం నిలబడరా ఒరే దేవుడా. ఈ మనుషులు – మగాళ్లు నా చంకల్ని చూసి యేటి సేయాలనుకుంటున్నారో, బొడ్డు కిందకి తొళ్ల మధ్యకి ఎన్ని కళ్లు ఎన్నెన్నిసార్లు బురదలో ఎడ్ల కాళ్లల్లే దిగబడిపోయింటాయో! ఓ కుర్రాడా,నీ చెల్లినిలా మొండి మొలతో నిలబెడితే చూసేవాడివా;? నీ తల్లి యిలా తల్లడిల్లి పోతుంటే సూసేవాడివా. ఓ అమ్మా నువ్విలా ఇంతమంది మొగాళ్ల నడుమ నిలబడగలవా పావలా అమ్మా, పావలా,పావలా కోసం నాను, బేడకోసం ఆ నూకాలమ్మ బట్టలూడ లాగేసుకున్నాం, ఆడాళ్లవనే వూసు మర్చిపోనాం. అయ్యా నీటు బాబు.నిగనిగ బూట్ల బాబు! నీ ఆడాళ్లు సిల్కు లైలాన్ సీరల్లో దాంకుంటారు. బేళ్లు పావలాలు పారేసుకుంటారు. పారేస్తారు. నవ్వుకుంటారు. నవ్వులుగా సెప్పుకుంటారు. బాబుల్లారా అమ్మల్లారా.ఒరే ఒరే ఒసే ఒసే పైసలకి ముడిపడిపోయిన పేణాలవి. ఒరే ఒరే పోలీసు. బడ్డీకాడ బీడీ కాలుస్తూ నిలబడున్నావా? తప్పుల్జరక్కుండా ఒప్పుల్జరిగేట్టు సూత్తాం అంటారు గదరా మీరు! నాయం అన్నాయం చూస్తారు గదరా మీరు,నాయనా! అయినా యిదంతా సూస్తూ వూరుకున్నావా. బాబూ! నేను రంకుదాన్నేనయ్యా. ఒళ్లమ్ముకునేదాన్నేనయ్యా. అద్దె సైకిల్నే బాబూ, సీకట్లో సిగ్గూ సెరం సీరానారా యిడిచేసేదాన్నే బాబూ! రోగాల పురుగుల పుట్టని – దాచుకున్న దాన్నే బాబూ.

ఇంతైనా నేను ఆడదాన్ని, బాబుల్లారా: నేనాడదాన్ని. మీరంతా నన్నూ నా ఒంటినీ రవరవ్వా సూసేశారు. కళ్లు కల్లుముంతలంత సేసుకుని, నా మానం అభిమానం మీ కళ్లలో కలిపేసుకున్నారు. నేను బతికేటికి. యింకా నే బతికేటికి.

పైడి యిదంతా పైకి అనాలనుకుంది. పైన ఆకాశం చిరిగేటట్టు, కింద నేల పేలేట్టు అరవాలనుకుంది. కాని – గొంతులో సిగ్గు అభిమానం సీసా మూతిలో బిగుసుకుపోయిన బిరడా అయిపోయాయి. పైడి అరవలేదు. కాని –

హాస్పిటల్ రోడ్డు పక్కన వాలుగా వున్న రోడ్డు మీద వాలులోకి సిటీబస్సు జోరుగా వరం ఇచ్చే దేవుడిలా వచ్చేస్తుంటే.

ఒడ్డున పడి గిలగిల గిలగిలలాడి హఠాత్తుగా నీట్లోకి దూకేసినచాపలాగా. బస్సు ముందు చక్రాల కిందికి దూకేస్తే, పైడి దూకేస్తే.

భయం... ఆశ్చర్యం.. కేకలు..రోడ్డుకి అటు ఇటూ కలగాపులగం అయిపోయినప్పుడు, నీళ్లున్న గ్లాసు కింద పడి భళ్లున పగిలి నీళ్లుచెల్లా చెదురేపోయినట్టు – అంతవరకూ పైడి శరీరంలో సజీవంగా సక్రమంగా ప్రవహిస్తున్న నెత్తురు రోడ్డుమీద అర్థం లేకుండా,ప్రయోజనం లేకుండా కళ్లాపులా చిమ్ముకుపోతే.

నేలకి ఆ నెత్తురు ఏ బాధని నివేదించుకుందో తలలోంచి బయటపడ్డ మెదడు మట్టిలో ఏ ఆలోచనలు చేసిందో, బయటకు పొడుచుకు వచ్చిన ముంజేతి ఎముక బస్సు ముందు చక్రానికి ఏ దిక్కుని చూపించిందో రెప్పలు మూయని కళ్లు ఎవరిని వెయ్యి చావులు శపించాయో.

హాయిహాయిగా వున్న గాలికి, పల్చపల్చగా వున్న ధూళికి, పచ్చపచ్చగా వున్న చెట్లకి వెచ్చవెచ్చగా వున్న ఎండకి,దూరంగా హోరు హోరుగా వున్న సముద్రానికీ,పైడిమీద బోర్లించిన మూకుడు సమాధి ఆకాశానికి తెలిసి వుండాలి.

తెలియకపోయీ వుండాలి.

★

